

ముక్కోటి దేవతలారా.. రారండోయ్!

తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. - 6లో



ఇస్రో ఫలాలు సామాన్యుడికి చేరువ

దేశంలోని మారుమూల గ్రామాల్లో సామాన్యుడికి ఇస్రో ప్రగతి ఫలాలు అందుతున్నాయని మోహన్ అన్నారు. - 6లో



ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శం కావాలి

ఆర్టీసీ డ్రైవర్లు అందరికీ ఆదర్శంగా ఉండాలని ప్రముఖ సామాజిక కార్యకర్త బాలాజీ పేర్కొన్నారు. - 6లో



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు



పెద్దశేష వాహనంపై స్వామి, అమ్మవార్లు

నయన మనోహరి..
శేషశయన విహారి

ఆదిశేషుడు..అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడికి వాహనం కాగా.. విష్ణుమూర్తి పెద్దశేషుడిపై కొలువుదీరగా.. తిరుమాడ వీధులు పులకించగా తిరువేంకటనాథుడు మాడవీధుల్లో విహరించారు. దేవదేవుని దర్శించుకున్న భక్త జనం పులకించారు. అంతకు ముందు సాయంత్రం సకల దేవతలు అతిథులుగా తరలి రాగా.. జనకోటి ఆనందపరవశం కాగా ఊరేగింది గరుడ పటం.. మార్మోగింది గోవింద నామస్మరణం.. ఎగిరింది ధ్వజపటం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం శ్రీవారి శేషవాహన సేవ వైభవంగా సాగింది.

– తిరుమల



పెద్దశేష వాహన సేవలో కళాబృందం నాట్య ప్రదర్శన

న్యూస్‌రీల్

7 నుంచి డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో మిగిలిన అన్ని సీట్ల భర్తీ కోసం ఈ నెల 7 నుంచి 10 వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తి గల విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం సంప్రదించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే మూడు విడతల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ అన్ని డిగ్రీ కళాశాలల్లో సుమారు 19 విభాగాల్లో 40 శాతం వరకు సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు 7న

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 7వ తేదీని చేపట్టనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులు వర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో సోమవారం హాజరుకావాలని సూచించారు. అలాగే పీజీ సెట్–2024లో రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన విద్యార్థులు ఈనెల 7వ తేదీలోపు వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో అన్ని ధ్రువ పత్రాలతో హాజరై అడ్మిషన్లు పొందాలని సూచించారు.

సెలవుల్లో స్కూళ్లు తెరిస్తే రూ.50 వేలు జరిమానా



ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నేతలతో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

శ్రీకాళహస్తి: సెలవుల్లో స్కూళ్లు తెరిస్తే రూ.50 వేలు జరిమానా విధిస్తామని డీఈఓ శేఖర్ హెచ్చరించారు. పలు పాఠశాలలు దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిసున్నాయని అధికారులకు అందించిన ఫిర్యాదు మేరకు డీఈఓ శేఖర్, ఎంఈఓ భువనేశ్వరి శ్రీకాళహస్తిలోని ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సెలవులు ప్రకటించామని, ఈ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే రూ.50 వేలు జరిమానా విధిస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నేతలతో డీఈఓ శేఖర్ చర్చలు జరిపారు. అనంతరం సెలవు ప్రకటించాలని ఆదేశించారు.



అసత్యాలు.. అక్షింతలు

కలియుగ దైవం ప్రాశస్త్యం విశ్వవ్యాప్తం.. హిందువులకు ఆరాధ్యదైవం..ఆ దేవదేవుని ప్రసాదం పరమ పవిత్రం.. అంతటి తిరుమల లడ్డూపై కూటమి సర్కారు రాజకీయం.. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంటూ అసత్య ప్రచారం.. హిందువుల మనోభావాలతో చెలగాటం..దీనిపై కన్నెర్రజేసిన సుప్రీం.. వేంకటనాథుడితో రాజకీయాలొద్దని ఆగ్రహం.. నిజనిర్ధారణకు ప్రత్యేక సిట్ ఏర్పాటుకు నిర్ణయం.. వెరసి కూటమి కుట్రలకు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో అడ్డుకట్ట. ఇదంతా కమలనాథుడి కటాక్షం అని సర్వత్రా హర్షం. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి కల్తీ ఆరోపణలపై సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం శుభపరిణామం. దేశంలోని కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా కొంత కాలంగా జరుగుతున్న అసత్య ప్రచారానికి అడ్డుకట్ట పడిందని ఆధ్యాత్మిక వేత్తలు, సాధారణ ప్రజలు, రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు.

– తిరుపతి సిటీ

కూటమి కుట్రకు సుప్రీం కోర్టు అడ్డుకట్ట

- సుప్రీం నిర్ణయం.. బాబు సర్కార్‌కు చెంప పెట్టే
- నెయ్యి కల్తీపై ప్రత్యేక సిట్ ఏర్పాటు శుభపరిణామం
- నిజాలు నిగ్గు తేలే సమయం ఆసన్నం
- రాజకీయ కుట్రలో భాగంగా చేసిన అసత్యప్రచారానికి బ్రేకులు
- స్వాగతిస్తున్న ఆధ్యాత్మిక వేత్తలు, ప్రజలు, రాజకీయ ప్రముఖులు

బాబు సర్కార్‌కు చెంపపెట్టు



రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌తో సరైన విచారణ జరగదని వైఎస్సార్ సీపీతో పాటు హిందూ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని జంతువుల కొవ్వుతో తయారు చేశారని సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణల్ని నిజం చేసేందుకే సిట్ దర్యాప్తు చేస్తుందని అందరూ విమర్శించారు. సిట్ అనేది నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయదనే అభిప్రాయాన్ని బలపరిచేలా... సర్వోన్నత న్యాయస్థానం కూడా అలాంటి వ్యాఖ్యలే చేసింది. నిష్పక్షపాత దర్యాప్తు కోసం సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా తిరుమలపై రాజకీయ ఆరోపణలు చేయవద్దు. తిరుమల ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించవద్దు. తిరుమల కేంద్రంగా కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలి.

–మద్దిల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం. తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న పవన్‌కల్యాణ్ తక్షణం తమ పదవులకు రాజీనామాలు చేయాలి. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ తిరుపతి సభలో మత విద్వేషాలను రెచ్చగొట్టడం దారుణం. ప్రజల్లో మత, కుల విద్వేషాలను రగిల్చే పవన్ ఉప ముఖ్యమంత్రిగా ఉండడానికి ఏమాత్రం అర్హుడు కాదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వేంకటేశ్వరస్వామి పట్ల అనుచితంగా ప్రవర్తించడం వల్లే శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ అపశ్రుతి చోటు చేసుకుంది.

– కె.నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

సుప్రీం నిర్ణయం సముచితం



దేశ అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం సముచితమైంది. వందల కోట్ల హిందూ ప్రజలు, సనాతన ధర్మ ప్రచారకులు, పీఠాధిపతులు, పండితులు ఆనందించే సమయమిది. వేంకటేశ్వర స్వామి ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ జరిగిన అసత్య ప్రచారానికి శ్రీవారే బ్రేక్ వేశారు. ఆయన భక్తుల మనోభావాలతో ఆడుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో మరోసారి రుజువు చేశారు. రాజకీయాలు సాధారణ ప్రజలతో చేస్తే చెల్లుతుందేమో కానీ, కలియుగ దైవం వద్ద చెల్లవు.

–కన్నయ్య స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు, తమిళనాడు

ప్రభుత్వానికి ఎదురు దెబ్బ



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఇది చంద్రబాబు సర్కార్‌కు ఎదురు దెబ్బగా చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నియమించిన సిట్ ద్వారా నిజాలు పూర్తిస్థాయిలో బయట పడవనే ప్రధాన నిర్ణయానికి కోర్టు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో సీబీఐ అధికారులు, ఆహార సంస్థ అధికారి, రాష్ట్ర అధికారులతో కలిపి సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించింది. దీంతో నిజాలు బయటపడే సమయం ఆసన్నమైంది. ఇది యావత్ భారత దేశంలోని హిందువులు స్వాగతించే అంశం. –ప్రభాకర్‌రావు, అధ్యాపకుడు, ఫుడ్ టెక్నాలజీ సంస్థ, తిరుపతి

వేంకటేశ్వర స్వామి మహత్యమే



వేంకటేశ్వర స్వామి మహత్యంతోనే సుప్రీం కోర్టు మంచి నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ పాలకులు భక్తుల మనోభావాలపై ప్రభావం చూపేలా ప్రవర్తించారు. నిజాలు తెలుసుకోకుండా తొందరపాటుగా సీఎం లడ్డూకు ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని ఆయనే తేల్చేశారు. ఆయన ఆధ్వర్యంలోనే పనిచేసేలా సిట్ కమిటీ నియమించి దారుణమైన తప్పు చేశారు. దీన్ని నిశితంగా పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ కమిటీని నియమించడం సరైన నిర్ణయం. శీఘ్రంగా దర్యాప్తు జరిగి నిజాలు బయటపడాలి.

–రత్న కుమారి, భక్తురాలు, తిరుపతి

మదనపడ్డాం.. దేవదేవుడే ఆజ్ఞాపించారు



తిరుమల లడ్డూలో కల్తీ పదార్థాలు వాడారంటూ దుష్ప్రచారం జరగడంతో పురోహితులు, పండితులు ఎంతో మదన పడ్డారు. అలా జరిగేందుకు కచ్చితంగా వీలు కాదనే వాదన పెద్ద ఎత్తున జరిగినా రాజకీయాలతో ముడిపెట్టి సాక్షాత్తు సీఎం లాంటి వ్యక్తి అసత్య ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సిట్‌ను నియమించారు. దీంతో అసలు నిజాలు బయటకు రావనే అపనమ్మకం ఉండేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసి, సుప్రీంకోర్టు ప్రత్యేకంగా సీబీఐ అధికారులతో సిట్ ఏర్పాటు చేయడంతో నిజాలు బయటకు వస్తాయని నమ్మకం కలిగింది. దైవదేవుడే కోర్టు ద్వారా ఆజ్ఞాపించాడనిపిస్తోంది.

–శ్రీపరమేశ్వరాచార్యులు, పూజారి, ఆలయ కమిటీ సభ్యులు, పూందమల్లై, చెన్నై

ప్రత్యేక సిట్ శుభపరిణామం



లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయడాన్ని సీపీఎం స్వాగతిస్తోంది. ఇది శుభపరిణామం. నిజానిజాలు నిగ్గు తేలుతాయి. లడ్డూలో కల్తీ జరిగిందని, జరగలేదని వాదోపవాదాలు సాగుతున్న సమయంలో సుప్రీంకోర్టు చొరవ చూపి స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఏర్పాటుకు ఆదేశించడం సమంజసం. విచారణ వేగంగా పూర్తి చేయాలి. లడ్డూ కల్తీ ఆరోపణల్లో నిజా నిజాలు బయటకు వచ్చే వరకు అందరూ ఓపిక పట్టాలి. అప్పటివరకు రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యక్తులు, సంయమనం పాటించాలి. భక్తుల మనోభావాలను దెబ్బతినేలా మాట్లాడటం మంచిదికాదు.

–వందవాసి నాగరాజ, జిల్లా కార్యదర్శి, సీపీఎం, తిరుపతి

అసత్యప్రచారానికి సుప్రీం అడ్డుకట్ట



వేంకటేశ్వరస్వామి ప్రసాదంపై జరిగిన అసత్య ప్రచారానికి సర్వోన్నత ధర్మాసనం అడ్డుకట్ట వేసిందనే చెప్పాలి. రాజకీయాల కోసం దైవదేవున్ని సైతం వదలకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న వారికి ఈ నిర్ణయం ఎదురుదెబ్బగా భావిస్తున్నాం. ఇంత పెద్ద తప్పు చేస్తున్నామని తెలిసి కూడా దీక్షలంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించడం దారుణం. దైవశక్తి మరో మారు రుజువైందని చెప్పవచ్చు. **–తంగవేలు వీరభద్రం, ఆలయ అర్చకులు, వేలూరు**

భక్తులు సంతోషంగా స్వాగతిస్తున్నారు



సుప్రీంకోర్టు నిర్ణయాన్ని భక్తులు సంతోషంగా స్వాగతిస్తున్నారు. లడ్డూ అంటే ప్రపంచ వ్యాప్తంగా ఎంత ఆదరణ పొందిందో మనకందరికీ తెలుసు. అటువంటి పవిత్రమైన శ్రీవారి ప్రసాదంపై అపనిందలు మోపి రాజకీయ కుట్ర చేయడం దారుణం. తాను ఒకటి తలిస్తే... దైవం ఒకటి తలుస్తుందనే సామెత సాక్షాత్తు ప్రస్తుత ప్రభుత్వానికి వర్తిస్తుంది. ఎవరితో రాజక్రీడలు ఆడినా దేవుని వద్ద తల వంచుకుని భక్తితో నడుచుకోవాలి.

–లక్ష్మీప్రియ, సంగీత కళాకారిణి, తిరుపతి

- ఇసుక ఉచితం అంటూ భారీ మొత్తంలో వసూళ్లు
- గత ప్రభుత్వం కన్నా రెట్టింపు ధరలతో ఇసుక
- తెలుగు తమ్ముళ్లు ఇసుక వ్యాపారం
- ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఎం నేతల ధర్నా

మంచి ప్రభుత్వం కాదు..
ముంచే ప్రభుత్వం



తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న సీపీఎం , భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

తిరుపతి అర్బన్: రాష్ట్రంలో నడుస్తోంది మంచి ప్రభుత్వం కాదు..ముంచే ప్రభుత్వమని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు వేణుగోపాల్ మండిపడ్డారు. శుక్రవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఎం నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ టీడీపీ సర్కార్ ఇది మంచి ప్రభుత్వం అంటూ ఊదరకొట్టుకోవడం ద్వారా ప్రయోజనం లేదని మండిపడ్డారు. వంద రోజుల పాలనలో ప్రజలకు చేసింది ఏమిటో చెప్పాలని నిలదీశారు. ఉచితం అంటే అర్థం ఎంటీ.. ఇసుకను అందరికీ ఫ్రీగా పంపిణీ చేయడం.. అయితే జిల్లాలో ఏడు నియోజకవర్గాలుంటే కేవలం మూడు నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు పెట్టారని గుర్తు చేశారు. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టడానికి ఇసుక కొనుగోలు చేయడం కన్నా రవాణా చార్జీలు అధికంగా అవుతున్నాయని అన్నారు. జూలై 8వ తేదీన ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటిస్తే...అప్పటి నుంచి ఏ పాయింట్ వద్ద ఇసుక అందుబాటులో లేకుండా చేశారని, ఎక్కడ చూసినా నో స్టాక్ అంటున్నారని, ఇదే అదునుగా కూటమి నేతలు వాగులు, వంకలు, నదుల వద్ద నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఎడ్ల బండ్లకు నో ఫ్రీ అని చెప్పిన అధికారులు టీడీపీ నేతలకు మాత్రం ఇసుక వ్యాపారం చేసుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి చిన్న, పి బుజ్జి, నరేంద్ర, శ్రీనివాసులు, రాధాకృష్ణ, శ్రీరాములు, సుందరం, శేషయ్య ,నారాయణస్వామి, యూసఫ్, ప్రసాద్, బాదుల్లా ముజాఫర్ పాల్గొన్నారు.

ఇసుక ఖర్చు తడిసి మోపెడు



గూడూరులో సీపీఎం, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుల నిరసన

గూడూరురూరల్: నియోజకవర్గంలోని మూడు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లుండగా ఇక్కడి వారు వెంకటగిరి, సూళ్లూరుపేటకు వెళ్లి ఇసుక తీసుకుని రావాలంటే ఖర్చు తడిసి మోపెడు అవుతుందని సీపీఎం నాయకులు దుయ్యబట్టారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం, సీఐటీయూ, నాయకులు భవన నిర్మాణ కార్మికులతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, భవన నిర్మాణ సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, సురేష్, బీవీ రమణయ్య, గగ్రం రమణయ్య, చంద్రయ్య, మధు, శంకర్‌రెడ్డి, చౌడయ్య, లక్ష్మీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి




ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు (ఇన్‌సెట్) మృతుడు సంపత్ (ఫైల్)

- బంధువులు ధర్నా

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని కోమటిగుంట దళితవాడలో విద్యుత్ షాక్‌కు గుర్రై జమాల్ అలియాస్ సంపత్(36) మృతి చెందాడు. గురువారం రాత్రి వర్షంతోపాటు వీచిన గాలికి విద్యుత్ తీగలు తెగి ఇంటిపై పడ్డాయి. ఇళ్లకు విద్యుత్ సరఫరా ఆగి పోయింది. చీకటిగా ఉండడంతో ఇంట్లో నుంచి రోడ్డుపైకి వచ్చేందుకు ప్రయత్నించగా విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. కొద్ది చేపటికి భార్య ఇద్దరు పిల్లలు ఇంటి నుంచి బయటి వచ్చి చూడగా స్పృహ తప్పి పడి ఉన్న భర్తను చూసి బిగ్గరగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసి ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించి, సరఫరా ఆపివేయించారు. బాధితుడిని కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందాడని డాక్టర్ తెలిపారు. శుక్రవారం ఉదయం మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కలసి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఆందోళనకు దిగారు. భర్త సంపాదనతో జీవనం సాగిస్తున్న భార్య, పిల్లలను ఆదుకోవాలని నిరసన తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



చెంగల్రాయులు(ఫైల్)

రేణిగుంట: మండలంలోని జీపాళెం దళితవాడకు చెందిన కాకి చెంగల్రాయులు(65) ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతని భార్య జయలక్ష్మి శుక్రవారం గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేసి, అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ముక్కోటి దేవతలారా.. రారండోయ్!



పెద్ద శేషునిపై విహరిస్తున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

- తుమ్మల గుంటలో ఆగమోక్తంగా ధ్వజారోహణం
- ధ్వజ పటంతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం
- పెద్ద శేషునిపై వెంకన్న విహారం
- కంకణ దారుడైన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం వైఖానస ఆగమోక్తంగా జరిగిన ధ్వజారోహణంతో ముక్కోటి దేవతలను ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు చేశారు. అంతకుముందు భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి, శ్రీవారి మాడ వీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. ఇందులో శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు.

పెద్దశేషునిపై కల్యాణ వెంకన్న

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు శుక్రవారం రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు పెద్దశేష వాహన సేవ జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారు ఏడు తలల పెద్ద శేష వాహనంపై పరమ పదనాథుని అలంకారంలో మలయప్ప స్వామి అనుగ్రహించారు.

కంకణ ధారుడైన చెవిరెడ్డి

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయడానికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కంకణ ధారణ చేసుకున్నారు. శుక్రవారం ఉదయం అభిషేక సేవలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత గోవింద మాల ధారణ చేశారు. గోవింద మాలతో దీక్ష చేపట్టిన చెవిరెడ్డి ఈనెల 12న బ్రహ్మోత్సవాలు ముగింపు తర్వాత దీక్షను విరమించనున్నారు.

ధ్వజస్తంభం చుట్టూ గురుడ పక్షి ప్రదక్షిణ



తిరుమల తరహాలో వైఖానస ఆగమోక్తంగా జరిగే తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభ సమయంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో అతి పెద్ద గరుడ పక్షి ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేయడంతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి కుటుంబంతో పాటు అక్కడే ఉన్న అర్చకులు, వేద పాఠశాల పిల్లలు, శ్రీవారి భక్తులు పెద్ద ఎత్తున గోవింద నామస్మరణలు చేశారు. అత్యంత పవిత్రమైన పద్ధతిలో జరిగే బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా సాక్షాత్తు ఆ గరుత్మంతుడు భక్తులను కటాక్షించడానికి వచ్చాడని స్థానికులు విశ్వసించారు.

టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించిన సీఎం



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజైన శుక్రవారం రాత్రి స్వామివారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ముద్రించిన 2025వ సంవత్సరం డైరీలు, క్యాలెండర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. 12 పేజీల క్యాలెండర్లు 13.50 లక్షలు, పెద్ద డైరీలు 8.25 లక్షలు, చిన్నడైరీలు 1.50 లక్షలు, టేబుల్ టాప్ క్యాలెండర్లు 1.25 లక్షలు, శ్రీవారి పెద్ద క్యాలెండర్లు 3.5 లక్షలు, శ్రీ పద్మావతి అమ్మవారి పెద్ద క్యాలెండర్లు 10 వేలు, శ్రీవారు- శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్లు 3 లక్షలు, 6 షీట్ క్యాలెండర్లు 50 వేలు, టీటీడీ స్థానిక ఆలయాలు 10 వేలు, తెలుగు పంచాంగం క్యాలెండర్లు 2.50 లక్షల కాపీలను టీటీడీ ముద్రించింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఈఓ జయ శ్యామల రావు, అదనపు ఈఓ శ్రీ వెంకయ్య చౌదరి, ఇతర ప్రముఖులు అధికారులు పాల్గొన్నారు. కాగా 2025 టీటీడీ డైరీలు, క్యాలెండర్లు అక్టోబరు 5వ తేదీ నుంచి తిరుమల, తిరుపతిలో అందుబాటులో ఉంటాయి. అక్టోబరు రెండో వారం నుంచి ఇతర ప్రాంతాల్లో భక్తులకు అందుబాటులో ఉంటాయి.

మహిళ దారుణ హత్య



మృతురాలు కోటమ్మ(ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: నమ్మి సహజీవనం చేస్తున్న మహిళను నమ్ముకున్న వాడే మద్యం మత్తులో కడతేర్చిన సంఘటన శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం రామలింగాపురం యానాదికాలనీలో నివాసముంటున్న కోటమ్మ (40) భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. చెంచయ్య అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి ఆరు నెలలుగా సహజీవనం చేస్తోంది. ఆరు నెలలు గడవకముందే చెంచయ్య తాగేసి వచ్చి గొడవ చేయడంతో గత కొన్ని రోజులుగా ఇంట్లో వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి కోటమ్మతో గొడవ పెట్టుకుని కర్రతో బలంగా తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో చెంచయ్య అక్కడ నుంచి పరారయ్యాడు. ఉదయం స్థానికుల సమాచారంతో శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

టీటీడీకి బీమా సొమ్ము చెల్లించండి

తిరుపతి లీగల్ : సేవా లోపానికి పాల్పడినందుకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ తిరుమల తిరుపతి దేవస్థానానికి పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పినట్టు టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్ కే. రాజేష్ తెలిపారు. ఫిర్యాదులోని వివరాల మేరకు.... టీటీడీ పరిధిలోని దేవాలయాల్లోని దేవతామూర్తులకు వేసే బంగారు నగలను టీటీడీ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో బీమా చేసింది. ఇందులో భాగంగా తిరుపతిలోని శ్రీ కోదండ రామాలయంలోని స్వామివారి బంగారు నగలకు రూ.55,21,304కు పాలసీ తీసుకున్నారు. 2008లో ప్రీమియం సొమ్ము రూ.2 25 లక్షలు టీటీడీ బీమా సంస్థకు చెల్లించింది. పాలసీ కాలం 2008 ఆగస్టు 26వ తేదీ నుంచి 2009 ఆగస్టు 25వ తేదీ వరకు ఉంది. అయితే 2009 ఆగస్టు 21వ తేదీన శ్రీ కోదండ రామాలయ స్వామి ఆలయంలోని బంగారు నగలు అపహరణకు గురయ్యాయని టీటీడీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో ప్రధాన అర్చకుడితో పాటు మరో ఇద్దరు పై పోలీసులు కేసు నమోదు చేశారు. అపహరణకు గురైన నగల్లో కొన్ని నగలు పోలీసులు రికవరీ చేయలేకపోయారు. దీంతో టీటీడీ అధికారులు పోలీసుల నుంచి తుది దర్యాప్తు రిపోర్టు, రికవరీ చేయలేని నగల రిపోర్టులను తీసుకున్నారు. రికవరీ చేయలేని నగల విలువ రూ.2,43, 480గా పేర్కొన్నారు. బంగారు నగలను బీమా కంపెనీలో బీమా చేశామని, అవి అపహరణ గురి కావడంతో నగల విలువ చెల్లించాలని బీమా కంపెనీ అధికారులను టీటీడీ అధికారులు కోరారు. దీనిపై బీమా సంస్థ అధికారులు స్పందించలేదు. దీంతో టీటీడీ ఈఓ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీపై తిరుపతి జిల్లా వినియోగదారులఫోరంలో ఫిర్యాదు దాఖలు చేశారు. పూర్వపరాలు పరిశీలించిన కమిషన్ అధ్యక్షురాలు స్నేహలత, సభ్యులు నాగ శశిధర్‌రెడ్డి నగల విలువ రూ.2,43,480 బీమా సంస్థ టీటీడీకి చెల్లించాలని తీర్పు చెప్పారు. అలాగే నష్టపరిహారం కింద రూ.లక్ష, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.10 వేలు తీర్పు తేది నుంచి 45 రోజుల్లోపు చెల్లించాలన్నారు. అలా చెల్లించకుంటే నగల విలువ సొమ్ముకు, నష్టపరిహారం సొమ్ముకు తొమ్మిది శాతం వడ్డీ లెక్కన 2003 ఆగస్టు 14వ తేదీ నుంచి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

ఇస్రో ఫలాలు సామాన్యులకు చేరువ

- షార్ నుంచి ఘనంగా అంతరిక్ష వారోత్సవాల ప్రారంభం
- వారం రోజులు పాటు అంతరిక్ష కార్యక్రమాల పట్ల అవగాహన.
- పాండిచ్చేరి టెక్నాలాజికల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ మోహన్..



అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా సావనీర్ విడుదల చేస్తున్న అతిథులు, షార్ అధికారులు

సూళ్లూరుపేట: దేశంలో మారుమూల గ్రామాల్లో ఉండే సామాన్యుడికి సైతం అంతరిక్ష సాంకేతిక ప్రగతి ఫలాలను అందిస్తున్నామని, ఈ సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఎంతో ప్రశంసనీయమని పాండిచ్చేరి టెక్నాలజికల్ యూనివర్సిటీ వైస్ చాన్స్లర్ డాక్టర్ ఎస్ మోహన్ పేర్కొన్నారు. ఈనెల 4 నుంచి 10 దాకా నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను తిరుపతి జిల్లాలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అంతరిక్ష ప్రయోగాల్లో ఎంతో వెనుపడి ఉన్న భారత్‌ను విక్రమ్ సారాభాయ్, సతీష్ ధవన్ లాంటి అంతరిక్ష పితామహులు చేసిన కృషితో చిన్న చిన్న ప్రయోగాలు చేసే స్థాయి నుంచి నేడు చంద్రయాన్-3 వంటి భారీ ప్రయోగాన్ని చేసి విజయాన్ని సాధించగలిగామని చెప్పారు. చంద్రయాన్-3 ప్రయోగంలో చంద్రుడిపై ల్యాండర్, రోవర్‌లను దించి పరిశోధనలు చేసే స్థాయికి చేరడమంటే ప్రతి భారతీయుడు గర్వపడాల్సిన విషయమన్నారు. ఇప్పటికే చంద్రుడు, అంగారకుడు, సూర్యునిపై పలు పరిశోధనలు చేసిన ఇస్రో శుక్రగ్రహం (వీనస్)పై పరిశోధనలు చేయడంతో పాటు గగన్‌యాన్, ప్రయోగంలో భాగంగా మానవ రహిత, మానవ సహిత ప్రయోగాలు చేసే స్థాయికి ఎదగడం భారతీయులుగా మనందరికీ గర్వకారణమన్నారు. మన అంతరిక్ష ప్రయోగాలతో విద్య, వైద్యం రంగాల్లో ఎంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించగలుగుతున్నామని చెప్పారు. ఒకనాడు అంతరిక్ష ప్రయోగాలు చేయడానికి ఇతర దేశాల వైపు చూసిన భారత్ నేడు ప్రపంచ దేశాలు సైతం భారత్ వైపు చూసేలా చేయడంలో ఎంతో మంది అంతరిక్ష పితామహులు కృషి దాగి ఉందని చెప్పారు.

రాబోయే 15 ఏళ్లలో భారీ ప్రయోగాలే లక్ష్యం

రాబోయే 15 సంవత్సరాల్లో భారీ ప్రయోగాలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, అందుకు తగినట్టుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తున్నామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. చంద్రయాన్-3 ప్రయోగం సక్సెస్‌తో షార్ కేంద్రానికి వచ్చిన గుర్తింపు గర్వించదగిన విషయమన్నారు. ఇస్రో చేస్తున్న ప్రయోగాల్లో మిథానీ గ్రూప్ భాగస్వాములుగా ఉండడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో శుక్రయాన్ ప్రయోగంతో గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ముందుగా మానవ రహిత ప్రయోగాలు నాలుగు చేసి, ఆ తరువాత మానవ సహిత ప్రయోగాన్ని చేసేందుకు సిద్ధం కానున్నామని చెప్పారు. ఈ కార్యక్రమలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, షార్ అధికారులు ఎస్‌వీఎస్ మూర్తి, ముత్తు చెజియన్, ఏ సయ్యద్ అహ్మద్, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండా యి. గురువారం అర్ధరాత్రి వరకు 63,376 మంది స్వామివారిని దర్శించుకోగా 25,146 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంట ల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికె ట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

ఆలయ అధికారుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి



మృతి చెందిన చంద్రశేఖర్

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయ అధికారుల నిర్లక్ష్యంతో ఓ నిండుప్రాణం బలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో దివ్య కై లాస గంగ స్నానఘట్టం ఉంది. ఇందులోకి శుక్రవారం చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన చంద్రశేఖర్(35) స్నానానికి దిగాడు. అయితే లోతు గుర్తించకపోవడంతో నీటిలో ఊపిరి ఆడక మృతి చెందాడు. నీటి లోతుపై ఆలయ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ఓ నిండు ప్రాణం బలైందని పలువురు ఆలయ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

భక్తుల బండి.. ఇదేమండీ!

- పాత బస్సులకే పూజలు
- ముగ్గురు భక్తులకు దుస్తుల బహూకరణ



పాత బస్సులకు పూజలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఏటా కొత్త బస్సులను కొనుగోలు చేసి, పూజలు నిర్వహించి, ముగ్గురు భక్తులకు సంప్రదాయబద్ధంగా దుస్తులు బహూకరించి ప్రారంభించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది మాత్రం పాత బస్సులకే పూజలు చేసి, మిగిలిన ఆచారాలన్నీ పాటించి, ప్రారంభించడంపై భక్తుల బండి.. అయినా ఇదేమండీ అని పలువురు గుసగుసలాడుతున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని ఏడుకొండల బస్టాండ్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున 1.30 గంటలకు బస్సులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు అందించిన మూడు జతల దుస్తులను ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ముగ్గురు భక్తులకు బహూకరించారు. ఉత్సవాలు ప్రశాంతంగా సాగాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, తిరుపతి డీఎం బాలాజీ, అలిపిరి డీఎం హరిబాబు, మంగళం డీఎం భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పాత బస్సులకే పూజలు

బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఏటా కొత్త సర్వీసులను కొనుగోలు చేసి, అందుబాటులోకి తీసుకువచ్చేవారు. ఆ సర్వీసులకే పూజలు చేసేవారు. అయితే ఈ ఏడాది కొత్త బస్సులను కొనుగోలు చేయలేదు. పాత బస్సులకే ప్రత్యేక పూజలు చేసి, ప్రారంభించారు. దీనిపై పలువురు ఆర్టీసీ ఉద్యోగులే అసంతృప్తి వ్యక్తం చేశారు.

అట్టహాసంగా మోహన మంత్ర-2024



పోటీల్లో పాల్గొన్న ఎంబీయూ చాన్స్‌లర్ మోహన్ బాబు



విద్యార్థులతో కలసి స్టెప్పులు వేస్తున్న మంచు విష్ణు

చంద్రగిరి: మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో శుక్రవారం మోహన మంత్ర-2024 మహోత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఎంబీయూలో మోహనమంత్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వచ్చిన ప్రతి విద్యార్థినీ అతిథిగా భావించి, వారికి తగిన సౌకర్యాలు కల్పించామన్నారు.

సందడి చేసిన మోహన్ బాబు

మోహన మంత్ర-2024 కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు సందడి చేశారు. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్‌లను ఆయన తిలకించి, కొన్ని ఈవెంట్‌లలో పాల్గొని, సందడి చేశారు. ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు విద్యార్థులతో కలసి స్టెప్పులేసి, వారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు పలు ఈవెంట్లు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వీసీ నాగరాజ రామారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శం కావాలి



ఆర్టీసీ డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లు అందరికీ ఆదర్శంగా ఉండాలని, ప్రమాదాలకు దూరంగా ఉండడానికి మెలకువలు పాటించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది ఎం. బాలాజీ తెలిపారు. తిరుపతి ఆర్టీసీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ప్రమాదాల నివారణపై ఆర్టీసీ ఈడీ తిమ్మాడి చెంగల్‌రెడ్డి నేతృత్వంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాకు చెందిన 100 మంది ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది ఎం.బాలాజీ హాజరై మాట్లాడారు. తొలుత ప్రమాదాలకు దూరంగా ఉంటామని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల మొగిలిఘాట్లో చోటుచేసుకున్న పెను ప్రమాదాన్ని గుర్తుచేశారు. నేషనల్ హైవే అథారిటీస్ నిర్లక్ష్యం, బ్యాడ్ డిజైన్‌తోనే ప్రమాదం జరిగిందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాంటి దారుణమైన సంఘటనలు పునరావృతం కాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన పలు అంశాలను సూచించారు. ప్రధానంగా ఘాట్ మార్గంలో వాహనాలను గేర్‌లో కాకుండా న్యూట్రల్ చేయడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఘాట్‌లో గేర్‌లోనే బండ్లు నడపాలని పేర్కొన్నారు. సూచికబోర్డులు మొక్కుబడిగా ఉన్నాయని, పలుచోట్ల తారుకు బదులుగా సిమెంట్ రోడ్డు వేయడం అనాలోచితమని పేర్కొన్నారు. వాహనం అదుపు తప్పుతున్న సమయంలో చివరి ప్రయత్నం వరకు ప్రమాదాన్ని తప్పించడానికి డ్రైవర్లు అన్ని శక్తులు ఉపయోగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓలు రాము, జగదీష్, తిరుపతి మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, డీఎంలు హరిబాబు, బాలాజీ, భాస్కర్‌రావు, ఏటీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

తిరుపతి సిటీ: తమకు న్యాయం చేయాలని ఎస్వీయూలో తొలగింపునకు గురైన తాత్కాలిక ఉద్యోగులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మొర పెట్టుకున్నారు. గురువారం రాత్రి తిరుపతికి విచ్చేసి పవన్ కళ్యాణ్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా వర్సిటీలో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్నామని, ఉన్నఫలంగా తమను అధికారులు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సుమారు 30 మంది తాత్కాలిక ఉద్యోగస్తులు రోడ్డుపైన పడ్డామని, ఎస్వీయూ అధికారులు తమ గోడును అర్థం చేసుకోవాలని విన్నవించినట్లు తెలిపారు. పవన్ కల్యాణ్ అందుకు సానుకూలంగా స్పందించి, తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ సీఎంను కలసిని వారిలో కిరణ్, లలిత, హేమంత్, ముని, లోకేష్, హరినాథ్, ప్రసాద్, సతీష్ ఉన్నారు.